15-02-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - మీ కోసం యోగ భట్టీ అత్యంత విలువైనది, ఎందుకంటే ఈ భట్టీ ద్వారానే మీ వికర్మలు భస్మమవుతాయి"

ప్రశ్న:- ఏ పిల్లల బుద్ధిలో బీజము మరియు వృక్షముల జ్ఞానము స్పష్టముగా కూర్చోగలదు?

జవాబు:- ఎవరైతే విచార సాగర మథనము చేస్తారో వారు. విచార సాగర మథనము చేసేందుకు అమృతవేళ సమయం చాలా మంచిది. అమృతవేళ లేచి బుద్ధి ద్వారా ఒక్క బాబానే స్మృతి చేయండి. మీ అజపాజపము (నిరంతర స్మృతి) కొనసాగుతూ ఉండాలి. సూక్ష్మముగా లేక స్థూలముగా శివబాబా, శివబాబా అని అనవలసిన అవసరం లేదు. బుద్ధి ద్వారా స్మృతి చేయాలి.

ఓంశాంతి. ఆత్మిక తండ్రి కూర్చొని ఆత్మలకు అర్థం చేయిస్తారు అనగా పిల్లలకు అర్థం చేయిస్తారు. తండ్రి అంటారు, నాకు కూడా దేహము ఉంది కావుననే నేను మాట్లాడగలను. అలాగే మీరు కూడా నేను ఆత్మను, ఈ దేహము ద్వారా వింటున్నాను అని భావించండి. ఈ జ్ఞానాన్ని బాగా ధారణ చేయాలి. ఏ విధముగా తండ్రిలో ధారణ అయి ఉందో అలా ధారణ చేయాలి. ఆత్మ యొక్క బుద్ధిలో ధారణ అవుతుంది. ఏ విధముగా తండ్రి బుద్ధిలో ధారణ అయి ఉందో అలా మీ బుద్ధిలో కూడా ధారణ అవ్వాలి. బీజము మరియు వృక్షముల వివరణైతే చాలా సహజమైనది. ఫలానా బీజాన్ని నాటడం ద్వారా ఇంత పెద్ద వృక్షము వెలువడుతుంది అన్న జ్ఞానము తోటమాలికి ఉంటుంది కదా. అంతే, బాబా కూడా అలాగే అర్థం చేయిస్తారు, దీనిని బుద్ధిలో ధారణ చేయాలి. ఏ విధముగా నా బుద్ధిలో ఉందో, అలాగే మీ బుద్ధిలో కూడా ఉండాలి. ఎప్పుడైతే విచార సాగర మథనము చేస్తారో, అప్పుడు అలా ఉంటుంది. విచార సాగర మథనము చేసేందుకు ఉదయం సమయం చాలా మంచిది. ఆ సమయంలో వ్యాపార-వ్యవహారాలేవీ ఉండవు. భక్తిని కూడా మనుష్యులు ఉదయము చేస్తారు. ఇక్కడకు, అక్కడకు వెళ్తూ ఉంటారు లేక కూర్చొని ఏదో ఒక నామజపం చేస్తూ ఉంటారు లేక పాటలు పాడుతారు, శబ్దాలు చేస్తారు, కొందరైతే లోలోపలే రామ, రామ అని అంటూ జపిస్తూ ఉంటారు. ఇది భక్తి యొక్క అజపాజపము. కొందరు మాలను కూడా తిప్పుతూ ఉంటారు. మీరు శివ, శివ అని అనకూడదు. మనుష్యులు భక్తిలో ఏదైతే చేస్తారో అది జ్ఞానములో ఉండకూడదు. ఎంతోమందికి అలవాటైపోయింది, శివ, శివ అని అంటూ స్మరణ చేస్తూ ఉంటారు. మీరు శివ, శివ అని స్థూలముగానూ, సూక్ష్మముగానూ జపించకూడదు. మన తండ్రి వచ్చి ఉన్నారు అని పిల్లలైన మీకు తెలుసు. వారు తప్పకుండా ఏదో ఒక శరీరములోకి వస్తారు. వారికి తమ శరీరమంటూ ఏదీ లేదు. వారు పునర్జన్మ రహితుడు. పునర్జన్మలు మనుష్య సృష్టిలో ఉంటాయి. విష్ణువు యొక్క రెండు రూపాలు లక్ష్మీ-నారాయణులు. దేవ-దేవ మహాదేవ అని అంటారు. బ్రహ్మకు మరియు విష్ణువుకు పరస్పరంలో సంబంధముంది. శంకరునికి ఏ సంబంధమూ లేదు, అందుకే వారిని పెద్దగా చూపిస్తారు. వారికి పునర్జన్మలు ఉండవు, వారికి సూక్ష్మ శరీరము లభిస్తుంది. శివబాబాకు సూక్ష్మ శరీరము కూడా లేదు, అందుకే వారు అందరికన్నా ఉన్నతోన్నతమైనవారు. వారు అనంతమైన తండ్రి. అనంతమైన తండ్రి నుండి మనం అనంతమైన సుఖం యొక్క వారసత్వాన్ని తీసుకుంటామని పిల్లలకు తెలుసు. తండ్రి శ్రీమతముపై మీరు పూర్తిగా నడవాలి. ఎవరైతే స్వయం స్మృతి చేస్తారో మరియు ఇతరులకు స్మృతిని కలిగిస్తారో, వారు తండ్రికి సహాయకుల వంటివారు. తండ్రిని మరియు వారసత్వాన్ని స్మృతి చేయాలి. పిల్లలకు అర్థం చేయిస్తూ ఉంటారు - ఇప్పుడు మీ 84 జన్మలూ పూర్తయ్యాయి. ఇంకా కొద్ది సమయమే మిగిలి ఉంది. నాటకంలోని పాత్రధారులు - ఇప్పుడు ఇంకా అరగంట మిగిలి ఉంది, ఆ తర్వాత మేము ఇంటికి వెళ్తాము అని భావిస్తారు. గడియారం చూస్తూ ఉంటారు. మీదైతే అనంతమైన చాలా పెద్ద గడియారము. ఇప్పుడు ఇక ఇంటికి వెళ్ళాలి అని అర్థం చేయించడం జరిగింది. తండ్రిని స్మృతి చేయడం ద్వారా మీ వికర్మలు వినాశనమవుతాయి, ఇంకే శాస్త్రాలలోనూ ఇటువంటి సహజ యోగము లేదు. వారైతే ఎంతో హఠయోగము చేస్తారు, ఎంతో కష్టపడతారు, అలా మాతలైన మీరు చేయలేరు. మీరు హఠయోగులు వలె ఆసనాలు వేయనవసరం లేదు. కానీ సభలో సరిగ్గా కూర్చోవాలి. మీది రాజయోగము - కాలుపై కాలు వేసుకొని కూర్చోవాలి. ఈ విధంగా రాజయోగములో కూర్చోవడం ద్వారా నషా ఎక్కుతుంది. హఠయోగములో రెండు కాళ్ళూ పైకెత్తుకుని పెట్టుకుంటారు. బాబా మీకు కష్టము ఇవ్వరు. కేవలం సాధారణంగా కూర్చోవడానికి మరియు యోగంలో కూర్చోవడానికి కాస్త తేడాను ఉంచాలి. మీరు రాజయోగము నేర్చుకుంటున్నారు. కావున ఎలా కూర్చోవాలంటే, మనుష్యులు వీరు రాజయోగములో కూర్చున్నారు అని భావించాలి. ఇది మన రాజరికపు పద్ధతి. మీరు అనంతమైన తండ్రి ద్వారా రాజులకే రాజులుగా అవుతున్నారు. ఇటువంటి తండ్రిని ఘడియ-ఘడియ స్మృతి చేయాలి. సత్యయుగములో తండ్రిని తలచుకోవడం జరగదు. స్వయాన్ని

తలచుకోవడం జరుగుతుంది. కలియుగములో తండ్రి గురించీ తెలియదు, స్వయము గురించీ తెలియదు. కేవలం తండ్రిని పిలుస్తూ ఉంటారు. ఇప్పుడు మీరు బాగా తెలుసుకున్నారు. తండ్రి బిందువని, ఇంకెవ్వరూ ఈ విధముగా అర్థం చేసుకోరు. వారు అతి సూక్ష్మమైనవారు అని కూడా అంటారు, మళ్ళీ వేలాది సూర్యుల కన్నా ప్రకాశవంతమైనవారు అని కూడా అంటారు. కావున వారి మాటలు కలవవు. నామ-రూపాలకు అతీతుడు అని అన్నప్పుడు మళ్ళీ వేలాది సూర్యుల కన్నా ప్రకాశవంతమైనవారు అని ఎందుకు అనాలి? ఇంతకుముందు మీరు కూడా ఇలాగే భావించేవారు. తండ్రి అంటారు - డ్రామాలో ఈ వివరణ ఆలస్యముగా లభించవలసి ఉంది. సూక్ష్మాతి-సూక్ష్మమైన గుహ్యమైన విషయాలను అర్థం చేసుకొని అర్థం చేయించడం జరుగుతుంది. మొదట వేలాది సూర్యుల కన్నా ప్రకాశవంతమైనవారు అని చెప్పి, ఇప్పుడు మళ్ళీ బిందువు అని ఎందుకు చెప్తున్నారు? అన్న ఆలోచన రాకూడదు. ఐ.సి.యస్. చదివేటప్పుడే ఐ.సి.యస్ విషయాలను చెప్తారు, అంతేకానీ ముందే ఎలా చెప్తారు? ఇందులో తికమకపడాల్సిన అవసరము లేదు. డ్రామాలో తండ్రి ఎప్పుడు అర్థం చేయించాల్సి ఉంటే, అప్పుడు అర్థం చేయిస్తారు, దీని తర్వాత కూడా ఇంకా ఏమేమి అర్థం చేయిస్తారో, ఎందుకంటే తండ్రి ప్రభావము కూడా వెలువడాలి కదా. ఏ విధముగా మీ ఆత్మ ఉందో, అలాగే వారు కూడా ఆత్మ. వారు పరంధామంలో ఉంటారు. వారిని పరమ ఆత్మ అని అంటారు. ఇక్కడకు వచ్చినప్పుడు జ్ఞానాన్ని ఇస్తారు.

తండ్రి అంటారు - ఎప్పుడైతే పతిత ప్రపంచము ఉంటుందో, అప్పుడు నేను పావన ప్రపంచాన్ని తయారుచేయడానికి వస్తాను. ఓ పతిత-పావనా, ఓ దుఃఖహర్తా-సుఖకర్తా రండి అని పిలుస్తారు కూడా. వారు సంగమయుగములో వస్తారు. ఎప్పుడైతే రాత్రి పూర్తవుతుందో అప్పుడు పగలు వస్తుంది. పాత ప్రపంచ అంతము జరుగుతుంది. కర్మాతీత అవస్థ అంతిమంలో ఏర్పడుతుంది. మీరు గృహస్థ వ్యవహారములోనే ఉండాలి, వదిలివేయకూడదు కూడా. శరీర నిర్వహణార్థము వ్యవహారాలు చేసుకుంటూ కమలపుష్ప సమానముగా పవిత్రముగా ఉండాలి. దేవతలైతే సంపూర్ణ పవిత్రులు. కానీ ఆ విధముగా ఎప్పుడు మరియు ఎలా తయారయ్యారు! తప్పకుండా పురుషార్థము చేసారు కావుననే ప్రారబ్ధం లభించింది. పురుషార్థానుసారముగా ప్రారబ్ధము తయారయ్యింది. ఎటువంటి కర్మలో అటువంటి ప్రారబ్ధము, ఇది ఇలా నడుస్తూనే ఉంటుంది. ఇప్పుడైతే మీకు కర్మలు నేర్పించే తండ్రి లభించారు. వారిని బాగా స్మృతి చేయాలి. మీరు దత్తత తీసుకోబడిన పిల్లలు. మార్వాడీలలో దత్తత తీసుకోవడం చాలా జరుగుతూ ఉంటుంది. మీది కూడా దత్తతయే. మీరు వీరి గర్భము నుండి వెలువడలేదు. దత్తత తీసుకోబడినప్పుడు ఇద్దరు తండ్రులూ గుర్తుంటారు. తాము అసలు ఎవరికి పుట్టారు అనేది చివరి వరకూ తెలిసే ఉంటుంది. ఇప్పుడు మీరు వీరికి దత్తత పిల్లలుగా అయ్యారు. మీకు కూడా - మేము ఎవరి పిల్లలుగా ఉండేవారము మరియు ఎవరి పిల్లలుగా అయ్యాము అనేది తెలుసు. నేను పరమపిత పరమాత్మ వద్ద దత్తత తీసుకోబడ్డాను, వారు స్వర్గ రచయిత. వారి రచన ఎంతకాలం కొనసాగుతుంది? అర్ధకల్పము. నరకం రచయిత రావణుడు, అతని రాజ్యము కూడా అర్ధకల్పం కొనసాగుతుంది. సతోప్రధానుల నుండి తమోప్రధానులుగా అవుతారు. ఇది అర్థం చేసుకోవాల్సిన విషయము. ఏదైనా అర్థం కాకపోతే అడగాలి. సూర్య-చంద్రులకు గ్రహణం పట్టినప్పుడు దానమివ్వాలి... అని అంటారు. సూర్య-చంద్రులను మాత-పితలు అని అంటారు. ఇక్కడ కూడా స్త్రీ, పురుషులు ఇరువురికీ గ్రహణం పడుతుంది, అప్పుడు 5 వికారాలను దానమివ్వండి అని అంటారు. అక్కడైతే సంవత్సరానికి ఒకటి, రెండుసార్లు గ్రహణం పడుతుంది. కానీ ఇక్కడిది మొత్తం కల్పం యొక్క విషయము. తండ్రి వచ్చి ఒక్క సారే దానం తీసుకుంటారు. మనుష్యులు పూర్తిగా నల్లగా అయిపోయారు. ఇది ఇనుపయుగము. సత్యమైన బంగారములో మిశ్రమలోహం కలవడంతో అది నల్లగా అయిపోతుంది. కొత్త ఇల్లు, పాత ఇల్లు. పసి పిల్లలు మరియు వృద్ధులలో తేడా అయితే ఉంటుంది కదా. చిన్న బాలుడు ఎంత మధురముగా మరియు ప్రియముగా ఉంటాడు. అందరూ అతడిని ముద్దు పెట్టుకుంటారు. ఒడిలో కూర్చోబెట్టుకుంటారు. శరీరం పాతబడి శిథిలావస్థకు చేరుకుంటే - ఈ శరీరము వదిలేస్తే బాగుంటుంది, ఎక్కువ దుఃఖాన్ని ఎందుకు సహించాలి అని అంటారు. ఆత్మ ఒక శరీరాన్ని వదిలి వెళ్ళి ఇంకొకటి తీసుకుంటుంది. ఇక్కడ మనము రోగగ్రస్థులను మరణించనివ్వము, ఎంత వింటే అంత మంచిది. శివబాబాను మరియు వారసత్వాన్ని స్మృతి చేస్తూ ఉండాలి. అనారోగ్యములో ఎప్పుడైతే ఎక్కువ నొప్పి కలుగుతుందో అప్పుడు అంతా మర్చిపోతారు. ఇకపోతే ఎవరికి ఎవరిపై భావన ఉంటుందో వారు ఎదురుగా వస్తారు. మీరైతే వాగ్దానం చేసారు - నాకు ఒక్క శివబాబా తప్ప ఇంకెవ్వరూ లేరు. మరి వేరేవారిని ఎందుకు గుర్తు చేస్తారు? తండ్రి అంటారు - నా స్మృతి తప్ప ఇంకెవ్వరి స్మృతి రాకూడదు. అంత్యకాలములో ఎవరైతే స్త్రీని స్మరిస్తారో... అని అంటూ ఉంటారు. మొత్తం శ్లోకమంతటినీ వినిపిస్తారు, కానీ అర్థమేమీ తెలియదు. భక్తిలో పాడేదంతా సంగమయుగానికి సంబంధించిన విషయమే, ఈ సమయంలో మీరు కేవలం తండ్రిని మరియు వారసత్వాన్ని స్మృతి చేయాలి. శ్రీనారాయణుడు మీ ప్రారబ్ధము కావున పూర్తి అర్థము బుద్ధిలో ఉండాలి. అర్థము తెలియకుండా ఎంతోమంది

తలచుకుంటూ ఉంటారు. ఎవరి పట్లనైతే ఎక్కువ ప్రీతి ఉంటుందో, చివరిలో వారే గుర్తుకొస్తారు. చాలా జాగ్రత్తగా ఉండాలి. మీరు ఒక్క తండ్రినే స్మృతి చేయాలి.

తండ్రి అంటారు - మన్మనాభవ. బాబా, మేము కల్ప-కల్పమూ మిమ్మల్ని కలుసుకుంటాము, ఈ జ్ఞానాన్ని మీ నుండి మధుబన్ కు వచ్చి తీసుకుంటాము అని పిల్లలైన మీరు అంటారు. ఇది వశీకరణ మంత్రము. వారు సద్గురువు కావున మీకు ఎటువంటి మంత్రాన్ని ఇస్తారంటే, దాని ద్వారా మీరు అమరులుగా అవుతారు. ఇది మాయపై విజయాన్ని పొందే మంత్రము. దీనిపై ఒక పాట ఉంది, తులసీదాస్ చందనమును అరగదీసారు... అని. ఇది కూడా ఇప్పటి విషయమే, ఇదే తర్వాత గాయనం చేయబడుతుంది. పిల్లలైన మీకు తండ్రిని మరియు వారసత్వాన్ని స్మృతి చేయడం ద్వారా రాజ్యతిలకము లభిస్తుంది. తండ్రిని మరియు రాజ్యాన్ని స్మృతి చేస్తూ శరీరము వదిలినట్లయితే రాజ్యతిలకము లభిస్తుంది. ఒకరికి మాత్రమే లభించదు కదా. మాల అనేది 108 మణులది కూడా ఉంది. 16108 మణులది కూడా ఉంది.

ఇప్పుడు మీరు కేవలం తండ్రిని ఏక్యురేట్ (ఖచ్చితము) గా స్మృతి చేయాలి. బాబా గురించి ఏమంటారంటే - మీరు ఇచ్చే గతి, మతము మీకే తెలుసు అని. అది నిజమే. సద్గతిదాత వారే, వారికే తెలుసు. ఇంతకుముందు కేవలం అర్థరహితముగా గానం చేసేవారు. దానిని అనర్థము అని అంటారు. అందులో ప్రాప్తి ఏమీ ఉండదు. మనుష్యులు దాన-పుణ్యాలు మొదలైనవి చేస్తూ-చేస్తూ దిగుతూనే వచ్చారు. ప్రాప్తి ఏమీ కలగలేదు. ఆసురీ మతముపై అంతా అనర్థము అయ్యింది. వీరు కూడా నారాయణుడిని పూజ చేసేవారు, ఇప్పుడు మళ్ళీ ప్రాక్టికల్ గా పూజారి నుండి పూజ్యునిగా అవుతున్నారు. శివబాబా మనల్ని చదివిస్తున్నారని ఇప్పుడు పిల్లలైన మీకు తెలుసు. ఇది పక్కాగా గుర్తుంచుకోవాలి. లేకపోతే వికర్మలు వినాశనమవ్వవు. ఈ యోగ భట్టీ అత్యంత విలువైనది. ముక్తి కూడా లభిస్తుంది కదా. కొందరు, మా మనస్సుకు శాంతి కావాలి అని అంటారు, కానీ మొదట అసలు మిమ్మల్ని అశాంత పరిచింది ఎవరో చెప్పండి? తప్పకుండా మొదట శాంతి ఉండేది. ఇప్పుడు అశాంతిగా అయ్యారు, కావుననే శాంతిని కోరుకుంటున్నారు. శాంతి మొత్తం ప్రపంచమంతటిలోనూ కావాలి. ఏ ఒక్కరికో శాంతి లభించడం ద్వారా ఏమీ జరగదు. ఏ ఒక్కరికో శాంతి లభించడం ద్వారా మొత్తం ప్రపంచమంతటిలోనూ శాంతి ఏమైనా ఏర్పడుతుందా. అశాంతిగా ఎవరు చేసారు? తికమక చెంది ఉన్నారు. శాంతిధామము, సుఖధామము ఉంటాయి మరియు ఇది దుఃఖధామము అని అర్థం చేయించడం జరిగింది. సుఖధామంలో మనుష్యులు చాలా కొద్దిమంది ఉండేవారు. ఆ సమయంలో మిగిలిన ఆత్మలందరూ శాంతిధామంలో ఉండేవారు. మీకు శాంతి అక్కడ లభిస్తుంది. ఇక్కడ లభించదు. ఇక్కడ ఉన్నది దుఃఖధామము. దుఃఖములో అశాంతి ఉంటుంది. ఇది ఎవరికైనా అర్థం చేయించడం చాలా సహజము. సుఖ-శాంతుల వారసత్వాన్ని ఇచ్చేవారు ఒక్క తండ్రియే. సత్యయుగంలో సుఖ-శాంతులు రెండూ ఉండేవి. ఇక్కడ ఆత్మ - నా మనస్సు శాంతిగా ఉండాలి అని కోరుకుంటుంది. అలాగైతే నీవు నీ ఇల్లు అయిన పరంధామానికి వెళ్ళు. కానీ పతితులు అక్కడకు వెళ్ళలేరు, అందుకే తండ్రి అర్థం చేయిస్తారు - నన్ను స్మృతి చేసినట్లయితే అంతమతిని బట్టి గతి ఏర్పడుతుంది. తండ్రిని మరియు వారసత్వాన్ని స్మృతి చేయండి. కానీ మాయ ఎటువంటిదంటే అది పవిత్రంగా అవ్వనివ్వదు. అబలలపై ఎన్ని అత్యాచారాలు జరుగుతాయో చూడండి. విషం లేకుండా ఉండలేరు. బాబా వద్దకు అనేక రకాల సమాచారాలు వస్తాయి. అన్నింటికన్నా పెద్ద హింస మహాశత్రువైన కామముది. తండ్రి అంటారు - పిల్లలూ, విషాన్ని వదలండి, ముఖాన్ని నల్లగా చేసుకోకండి. అలా అంటే, ప్రయత్నిస్తాము అని అంటారు. ఇది విషము, ఇది ఆదిమధ్యాంతము దుఃఖము ఇచ్చేది. కానీ భాగ్యములో లేకపోతే వినసే వినరు. ఆత్మలకు తండ్రి కూర్చుని అర్థం చేయిస్తారు - ఈ రోజు నుండి వికారాల్లోకి వెళ్ళకండి అని, అప్పుడు తల క్రిందికి దించేసుకుంటారు. అరే, కామము మహాశత్రువు, అదేమైనా మంచిదా. ఇది వికారీ ప్రపంచము, అందరూ పతితులుగా ఉన్నారు. సత్యయుగంలో అందరూ సంపూర్ణ నిర్వికారులుగా ఉంటారు. అచ్ఛా.

మాతా-పితలైన బాప్ దాదా యొక్క కల్పము తర్వాత అనగా 5000 సంవత్సరాల తర్వాత కలిసిన మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. సమయం చాలా తక్కువగా ఉంది, అందుకే తండ్రికి పూర్తి-పూర్తి సహాయకులుగా అయి ఉండాలి. తండ్రిని మరియు

వారసత్వాన్ని స్మృతి చేయాలి మరియు ఇతరుల చేత కూడా చేయించాలి.

2. అంతిమ సమయంలో ఒక్క తండ్రి స్మృతియే ఉండాలి, దాని కోసం హృదయపూర్వకమైన ప్రీతిని ఒక్క తండ్రితోనే పెట్టుకోవాలి. తండ్రి తప్ప ఇంకెవరి స్మృతి కలగకూడదు, ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

వరదానము:- ఆలోచించడము, చెప్పడము మరియు చేయడము, ఈ మూడింటినీ సమానంగా చేసుకునే తండ్రి సమానంగా సంపన్న భవ

బాప్ దాదా ఇప్పుడు పిల్లలందరినీ సమానంగా మరియు సంపన్నంగా చూడాలనుకుంటున్నారు. సంపన్నంగా అయ్యేందుకు ఆలోచించడము, చెప్పడము మరియు చేయడము, ఈ మూడు సమానంగా ఉండాలి. దీని కోసం ఏర్పాట్లు కూడా చేసుకుంటారు, సంకల్పము కూడా ఉంది, కోరుకునేది కూడా ఇదే. కానీ ఎప్పుడైతే ఇతర కోరికలన్నింటి నుండి కోరిక అంటే ఏమిటో తెలియనివారిగా అవుతారో, అప్పుడే ఈ కోరిక పూర్తవుతుంది. అనేక రకాల చిన్న-చిన్న కోరికలే ఈ ఒక్క కోరికను పూర్తవ్వనివ్వవు.

స్లోగన్:- అవ్యక్త లేక కర్మాతీత స్థితిని అనుభవం చేయాలంటే - చెప్పడం, చెయ్యడం మరియు ఉండడం, ఈ మూడింటినీ సమానం చెయ్యండి.